20 నుంచి 66 అడుగులకు..

నాడు

గాజువాక మెయిన్ రోడ్‌కు ప్రత్యామ్నాయంగా చెప్పుకొనే కణితి రోడ్డు ఎంత ఇరుకుగా ఉండేదో అందరికీ తెలిసిందే. మాస్టర్ ప్లాన్‌లో పెద్ద రోడ్డుగా ఉన్నప్పటికీ వాస్తవంలో మాత్రం చిన్న రోడ్డే ఉంది. ఆ చిన్నరోడ్డుకు అజీమాబాద్ గెడ్డపై ఎప్పుడో పూర్వం నిర్మించిన వంతెన మరింత చిన్నదిగా ఉండేది. దీంతో ఒక వాహనం వంతెనను దాటుతుంటే దాని ఎదురుగా వెళ్లే వాహనం కొద్దిసేపు ఆగాల్సిన పరిస్థితి.

నేడు

ఇప్పుడు ఆ వంతెన స్వరూపమే మారిపోయింది. 20 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ వంతెనను జీవీఎంసీ అధికారులు తొలగించి దాని స్థానంలో 66 అడుగుల వెడల్పుతో కొత్త వంతెన నిర్మించారు. ప్రస్తుతం కణితి రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు రూ.90 లక్షలతో కొత్త వంతెనను అందుబాటులోకి తెచ్చారు.



నేడు

అజీమాబాద్ గెడ్డపై 66 అడుగుల వెడల్పుతో అందుబాటులోకి వచ్చిన వంతెన



నాడు

అజీమాబాద్ గెడ్డపై పాత వంతెన (ఫైల్)

- మారిన వంతెన స్వరూపం
- కణితి రోడ్డులో రూ.90 లక్షలతో విస్తరణ
- వాహనచోదకుల హర్షం



గాజువాక: అభివృద్ధి ఏ కొన్ని ప్రాంతాలకో.. ఏ కొద్ది అంశాలకో పరిమితం కాకూడదు. అన్ని ప్రాంతాల్లో సమగ్రంగా అభివృద్ధి జరగాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. అందుకు అనుగుణంగా ప్రతీ చిన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది అధికార యంత్రాంగం. రహదారులు మొదలుకుని శ్మశానవాటికల వరకు ప్రతీది అభివృద్ధి చేస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కడా నిలిచిపోకుండా ఇరుకు మార్గాల విస్తరణతో పాటు చిన్న వంతెనలను కూడా విశాలంగా విస్తరిస్తున్నారు. గాజువాకలోని కణితి రోడ్‌ను ప్రస్తుతం వంటిల్లు జంక్షన్ నుంచి కొత్తగాజువాక మార్కెట్‌ను ఆనుకొని ఉన్న బీసీ రోడ్ వరకు విస్తరిస్తున్న విషయం తెలిసిందే. 66 అడుగుల వెడల్పుతో 1.25 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరిస్తున్న నేపథ్యంలో రూ.90 లక్షలు ఖర్చు చేసి అజీమాబాద్ గెడ్డపై ఇటీవల వంతెన నిర్మించారు. ఇప్పుడు వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడటం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసిన అధికారులు దానికి అనుసంధానం చేస్తూ కాలువల నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు.

రాకపోకలకు చాలా బాగుంది



కణితి రోడ్‌లో అజీమాబాద్ గెడ్డ వద్ద వంతెన దాటాలంటే కష్టంగా ఉండేది. ఇప్పుడు కొత్త వంతెన అందుబాటులోకి రావడంతో రాకపోకలకు బాగుంది. బాగా పెద్ద వంతెన నిర్మించడం వల్ల మరో రెండు దశాబ్దాల వరకు ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బంది ఉండదని భావిస్తున్నాం.

– గుల్ల కృష్ణమూర్తి, గాజువాక

అద్భుతంగా అభివృద్ధి చేశారు



అజీమాబాద్ కాలనీ గెడ్డపై వంతెనను అద్భుతంగా తీర్చిదిద్దారు. రాకపోకలకు ఇప్పుడు సౌకర్యవంతంగా ఉంది. దీన్ని వెడల్పు చేయాలని ఎంతో కాలంగా ప్రజలందరూ కోరుతూ వచ్చారు. ఈ ప్రభుత్వం స్పందించి వెడల్పు చేసింది. ఇప్పుడు చాలా బాగుంది.

– జెట్టి శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, గాజువాక

క్లుప్తంగా

75వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 75వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.80లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డులో గత ఏడాదిన్నర కాలంలో రూ.17కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. పెదగంట్యాడ జంక్షన్‌లో కల్వర్టు నిర్మిస్తున్నామని, అలాగే చినకోరాడ ఎస్సీ కాలనీలో కాలువలు, మొల్లివానిపాలెంలో సీసీ రోడ్డు, సీతానగరం యాదవుల కాలనీలో ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డిని స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, వెంపాడ అప్పారావు, కొయ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్లకు న్యాయం చేయాలి'

అగనంపూడి: వైద్యరంగంలో కీలకంగా వ్యవహరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల పదోన్నతుల్లో అన్యాయం చేయొద్దని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మీసాల సూర్య శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల క్యాడర్‌కు ఉన్న ఒకే ఒక పదోన్నతిని కూడా ఫార్మసిస్ట్‌లకు కట్టబెట్టేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని ఆరోపించారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకుని ల్యాబ్ టెక్నీషియన్లకు న్యాయం చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. కోక్ విభాగం కోల్ సార్టింగ్ ప్లాంట్–1లో కాంట్రాక్టు సంస్థ రాధాకృష్ణ ఇంజినీరింగ్‌లో డి.భాస్కరరావు (41) అన్‌స్కిల్డ్ కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్నారు. ఆయన పెదగంట్యాడలో తన కుటుంబంతో నివసిస్తున్నారు. భాస్కరరావు కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధికి మందులు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం యథావిధిగా జనరల్ షిఫ్ట్ విధులకు వెళ్లిన ఆయన, అక్కడ చేంజ్ రూమ్ పక్కన ఉన్న వాష్ రూమ్ వద్ద వాంతి చేసుకున్నారు. అనంతరం చేంజ్ రూమ్ లోపలికి వెళ్లారు. కొంతసేపటి తర్వాత సహకార్మికుడు రూమ్‌కు వెళ్లగా అక్కడ భాస్కరరావు కింద పడి ఉండడంతో సూపర్‌వైజర్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ స్వామినాయుడు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

పెదగంట్యాడ: మండలంలోని బాలచెరువుకు చెందిన ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం, రాజాం గ్రామానికి చెందిన పోతనపల్లి రవీంద్ర అనే వ్యక్తి రెయ్యి రాజేశ్వరి (40)తో కలసి బాలచెరువులో నివాసం ఉంటున్నారు. రవీంద్ర విధుల నిమిత్తం ఇటీవల లక్నో వెళ్లడంతో ఇంట్లో రాజేశ్వరి, ఆమె సోదరుడు ఉండేవారు. గత నెల 28న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేశ్వరి తిరిగి రాకపోవడంతో, ఆమె సోదరుడు కంగారు పడ్డారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో బావ రవీంద్రకు సమాచారం ఇచ్చారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

పెదగంట్యాడ: బాలాజీ నగర్లో సమస్యలను పరిష్కరించడంతో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో గొందేశి వెంకట రమణ ఆధ్వర్యంలో ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. రోడ్లు, కాలువలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయని చెప్పారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



డ్రైడే పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ సింహాచలం, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డే పాటించాలని గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం కోరారు. 75వ వార్డు పాత అయ్యన్నపాలెంలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై ఎవరూ చెత్త వేయరాదని, ఇళ్లలోనే తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇళ్లలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది తద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు మలేరియా సిబ్బంది చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ రామారావు, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి నాగు, మలేరియా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

- వాడవాడలా విస్తృతంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు



అగనంపూడి ఏరియా ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



ఎయిడ్స్ రిబ్బన్ ఆకారంలో విజ్ఞాన్ ఫార్మా విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు

అగనంపూడి: ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడం కేవలం అవగాహనతోనే సాధ్యమని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం నెలకు రూ.3వేల విలువైన మందులు అందిస్తుందన్నారు. ఆస్పత్రి ద్వారా గుర్తించిన 365 మంది బాధితులకు క్రమం తప్పకుండా మందులు అందిస్తున్నామని చెప్పారు. తరువాత నివారణా మార్గాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉష, కౌన్సెలర్ రవికుమార్, డాక్టర్ గోపీకృష్ణ, ప్రత్యూష, ప్రమీల, దుర్గ, కల్యాణి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు రెడ్ రిబ్బన్‌గా ఏర్పడ్డారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు
- స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

హెచ్ఐవీ బాధితులపై ప్రేమాభిమానాలు చూపాలి

గాజువాక : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల ప్రేమాభిమానాలు చూపాలని జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. బాధితులపట్ల ప్రేమాభిమానాలు చూపినప్పుడే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపినట్లు అవుతుందన్నారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానిక నాయకులు సిరట్ల శ్రీనివాస్, ఎస్‌వీకే పరశురామ్, నాగేశ్వరరావు, డిజైర్ సొసైటీ ప్రతినిధులు పి.లక్ష్మణ, త్రివేణి, శివమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

- వాటి కొనసాగింపునకు మళ్లీ జగనే రావాలి
- ఇది ప్రజల ఆకాంక్ష
- వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి వెల్లడి



వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ కరపత్రాలు అందిస్తున్న దేవన్‌రెడ్డి



రెడ్డితుంగ్లాం సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న దేవన్ రెడ్డి

అగనంపూడి: అభివృద్ధి పరుగులు తీయాలన్నా.. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ కొనసాగాలన్నా.. ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కాలన్నా.. ముఖ్యమంత్రిగా జగన్ మళ్లీ రావాలని ప్రజలు అభిలషిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 79వ వార్డు ప్రశాంతినగర్ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు అండగా, విద్యార్థులకు అన్నగా, ఆపన్నులకు ఆప్తునిగా, మహిళలకు చేయూతనందించే సోదరునిగా, రైతులకు ఆపద్బాంధవునిగా, అన్ని వర్గాల ప్రజలకు చేదోడుగా ఉంటున్న సీఎం జగన్ రాష్ట్రానికి మళ్లీ రథసారథి కావాలని కోరుకుంటున్నారన్నారు. పార్టీ జెండాను.. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రూపొందించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, జిల్లా కార్యదర్శి గుర్రం శ్రీను, వార్డు సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

77వ వార్డు నమ్మిదొడ్డిలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం 16కోట్ల 44 లక్షల 45వేల 829 రూపాయలను వెచ్చించినట్లు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి తెలిపారు. వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఆమె ప్రారంభించారు. కె.శివకుమా ర్, కాసు కుమార్, ఎంపీ రెడ్డి, అప్పారావు, ఆర్పీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

69వ వార్డు రెడ్డి తుంగ్లాంలో..

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి అన్నారు. 69వ వార్డు రెడ్డితుంగ్లాం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా అమలు పరిచిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మభ్యపెట్టే ఉపన్యాసాలతో, అబద్ధపు హామీలతో, ప్రజలను మోసం చేసే విన్యాసాలతో వస్తున్న అవినీతిపరుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మాయలో పడవద్దని ప్రజలకు హెచ్చరించారు. రెడ్డితుంగ్లాం సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.21,83,00,986లను అందజేశారన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్సీ పి.సింహాచలం, నాయకులు కాకి అప్పల రెడ్డి, సాలాపు వెంకటరావు, అంగ బాబూరావు, వాకాడ దుర్గా రెడ్డి, మహ్మద్ గౌస్, కొల్లి కుంచారావు, కొల్లి నత్యం, మద్ది గోవింద రెడ్డి, ఈగలపాటి యువశ్రీ, గొందేశి రామిరెడ్డి, మళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం హామీలు నిలబెట్టుకోకుంటే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి

ఉక్కునగరం: ఉక్కు యాజమాన్యం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ఆందోళన తప్పదని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, సీఐటీయూ మిత్రపక్షాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడపడం యాజమాన్యానికి చేతకావడం లేదన్నారు. కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయలేకపోతోందన్నారు. వీటిని చేయలేని యాజమాన్యం యూనియన్ ప్రతినిధులను పరిపాలన భవనంలోకి రానివ్వకుండా కంచెలు వేయడం దుర్మార్గమన్నారు. జిందాల్‌ను ప్లాంట్‌లోకి ఆహ్వానిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సెయిల్‌ను అనుమతించి పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీ, జీఎంలు కె.సంజీవరావు, చక్రవర్తి, సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్, బి.అప్పారావు, పి.శ్రీనివాసరాజు, డి.వి.రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'అమర వీరుల త్యాగం వృథా కానివ్వం'



దీక్ష శిబిరంలో ప్రసంగిస్తున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. నాటి వీరుల త్యాగ ఫలితాన్ని వృథా కానీయమన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరంలో 1023వ రోజు సంస్థలోని ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్ తదితర విభాగాల కార్మికుల పాల్గొని నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ పరిశ్రమగానే కొనసాగుతుందని కేంద్రప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇచ్చేవరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు

గాజువాక : ఓటర్ల నమోదుకు శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. అర్హులైన యువతీ యువకులు తమకు సమీపంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి, సంబంధిత ఫారాలను అందజేసి ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే ఓటు హక్కు కలిగినవారు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న జాబితాల్లో చూసుకోవాలని కోరారు.

ఫెస్టివల్స్‌తో పిల్లల్లో ఆత్మస్థైర్యం



ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం మధుసూదనరావు



విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ఉక్కునగరం: చిల్డ్రన్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం ఎం.మధుసూదనరావు అన్నారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్(వీసీసీ) ఆధ్వర్యంలో రెండు రోజుల చిల్డ్రన్ ఫెస్టివల్స్ శుక్రవారం స్థానిక అంబేడ్కర్, జ్యోతి బాల విహార్ ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు విజ్ఞానం, వినోదం, ఆటలు వంటి కార్యక్రమాలతో అభివృద్ధి చెందుతారన్నారు. గాజువాక ఎంఈవో ఎం.సునీత మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వీసీసీ కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ 74 ఈవెంట్లలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు, జిల్లా మాస్టర్ అథర్స్ సంయుక్త కార్యదర్శి బి.పద్మావతి, మాజీ కార్పొరేటర్ కె.విమల, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు డి.మధుసూదనరావు, జనవిజ్ఞాన వేదిక కె.వి.ప్రసాద్, నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, టీనా, సుమలత, సుమతి, పద్మ, అంబిక పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఎస్ఎస్ పరిధిలోని 33/11 కేవీ లోని సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఆటోనగర్ ఎయిర్ పరిధిలో విశ్వేశ్వరాయనగర్, 11 కేవీ తోకాడ పరిధిలో పార్ట్ ఆఫ్ ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, తోకాడలోని భాగం, 11 కేవీ ఆక్సిజన్, 11 కేవీ వి.కె.స్టీల్, 11 కేవీ బ్లాక్, 11 కేవీ ఆటోనగర్ ఇండస్ట్రియల్, 11 కేవీ ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్‌ల పరిధిలోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలియజేశారు.

డంపింగ్‌యార్డ్ తరలించాలి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్‌కు ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని అఖిలపక్షాల నాయకులు కోరారు. ఈ మేరకు 16 గ్రామాల ప్రజలతో కలసి డంపింగ్ యార్డ్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి శంకరనారాయణ, రంభ నారాయణమూర్తి, జనసేన నాయకుడు ముమ్మన మురళి, సీపీఎం నాయకుడు రాంబాబు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ కారణంగా 16 గ్రామాల ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతవుతున్నారన్నారు. మూడేళ్లుగా దీనిని తరలించాలని కోరుతున్నా అధికారుల్లో చలనం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజలతో కలసి నిరాహార దీక్షలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 16 గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాలికకు అరుదైన చికిత్స



వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్న పాప తండ్రి

అక్కిరెడ్డిపాలెం: స్ట్రీట్ ఫుడ్ తినడంతో రక్తం విషపూరితమై ప్రాణాపాయ స్థితికి చేరిన తొమ్మిదేళ్ల బాలికకు కిమ్స్ ఐకాన్ వైద్యులు సకాలంలో వైద్యం అందించి, ప్రాణాలు కాపాడారు. కిమ్స్ ఐకాన్ పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ విభాగాధిపతి డాక్టర్ రౌతు సంతోష్ కుమార్, చీఫ్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ తెన్నేటి నిఖిల్ తెలిపిన వివరాలివి..

నగరానికి చెందిన తొమ్మిదేళ్ల పాప తీవ్రమైన జ్వరం, వాంతులు, ఊపిరి అందని పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకువచ్చారని చెప్పారు. మూడు రోజులు చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ సపోర్ట్ పెట్టామని తెలిపారు. పాపకు పరీక్షలు నిర్వహించిన అనంతరం స్ట్రీట్ ఫుడ్ తిన్న తర్వాత రక్తం విషపూరితంగా మారడం (సెప్సిస్) అనే తీవ్ర సమస్య వచ్చిందని గుర్తించినట్లు చెప్పారు. మూత్రపిండాలు పాడవడం, రక్తహీనత, ప్లేట్‌లెట్స్ పడిపోవడం వంటి ఎన్నో సమస్యలు వచ్చాయన్నారు. 20 రోజుల చికిత్స అనంతరం ఆమె కోలుకోవడంతో వైద్యబృందానికి పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.